క్లుప్తంగా

రాజన్న కోడెలకు పశుగ్రాసం



పశుగ్రాసం అందిస్తున్న వెంకటరమణారెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రైతు ఎడవెల్లి వెంకటరమణారెడ్డి వరిగడ్డిని కట్టలు కట్టించి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం కోడెలకు సొంత ట్రాక్టర్‌లో తీసుకెళ్లి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిత్య జనగణమన కమిటీ అధ్యక్షుడు ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో శంకర్ శిల్పం



శంకర్ రూపొందించిన సద్దుల బతుకమ్మ సైకత శిల్పం

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్‌కు ఒడిశా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహించే ఇంటర్ నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు రెండోసారి అరుదైన అవకాశం లభించింది. ఇందులో భాగంగా శుక్రవారం కల్చర్ అండ్ హెరిటేజ్ విభాగంలో తెలంగాణ రాష్ట్ర పండుగ సద్దుల బతుకమ్మ వేడుక ఉట్టిపడేట్లు సైకత శిల్పాన్ని శంకర్ రూపొందించి అభినందనలు అందుకున్నారు.

వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న వావిలాల పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

జమ్మికుంట: మండలంలోని వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ కుడిసియా పర్యవేక్షణలో పట్టణ, మండలంలోని ఉపకేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడారు. ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు మహోన్నత పటేల్, హిమబిందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా ఫుల్‌స్టాప్ పడేనా..!

- చొప్పదండిలో కొన్నేళ్లుగా కాంగ్రెస్‌కు అనుకూలంగా పడని ఓట్లు
- పన్నెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పదిసార్లు రెండో స్థానమే
- కాంగ్రెస్ గెలిచింది రెండు సార్లే
- అనుకూల అంశాలతో మూడోసారి గెలుపొంది చరిత్ర సృష్టించేనా..!



సుంకె రవిశంకర్

మేడిపల్లి సత్యం

చొప్పదండి: చొప్పదండి శాసన సభ స్థానం ఏర్పడినప్పటి నుంచి కాంగ్రెస్ వ్యతిరేక గాలి వీస్తోంది. మొత్తం పన్నెండుసార్లు జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు రెండుసార్లు గెలుపొందారు. పదిసార్లు కాంగ్రెసేతర అభ్యర్థులే గెలిచారు. పదిసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు రెండో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. చొప్పదండి నియోజకవర్గం 1957లో ఏర్పడింది. ఆ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి బి.రాములుపై గెలుపొందారు.

మొదటి గెలుపు

- 1962లో జరిగిన ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థులుగా కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన బి.రాములు ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్.రెడ్డిపై గెలుపొందారు. నియోజకవర్గానికి రెండోసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ బోణీ కొట్టింది. 1967, 1972లో ఈ నియోజకవర్గాన్ని కరీంనగర్ నియోజకవర్గంలో కలిపారు. తిరిగి 1978లో చొప్పదండి నియోజకవర్గాన్ని కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎం.క్రిష్టారెడ్డి, కాంగ్రెస్(ఐ)నుంచి పోటీ చేసిన న్యాలకొండ శ్రీపతిరావు చేతిలో ఓడిపోయారు. 1983 నుంచి ఇక్కడ టీడీపీ అభ్యర్థులే ఎక్కువసార్లు గెలుస్తూ వచ్చారు. టీడీపీ ఆవిర్భావం అనంతరం 1983లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఏఎస్‌రెడ్డి, టీడీపీ నుంచి పోటీ చేసిన గుర్రం మాధవరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 1985లో కాంగ్రెస్ నుంచి బండారి రామస్వామి చొప్పదండిలో పోటీ చేయగా, టీడీపీ నుంచి తొలిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన న్యాలకొండ రాంకిషన్‌రావు చేతిలో ఓడిపోయారు. కోడూరి సత్యనారాయణగౌడ్ కాంగ్రెస్ తరుపున 1989, 1994లో పోటీ చేసి న్యాలకొండ రాంకిషన్‌రావు చేతిలో ఓటమి చవి చూశారు.

రెండో గెలుపు

- ముప్పైయేడేళ్ల అనంతరం 1999లో టీడీపీ అభ్యర్థి న్యాలకొండ రాంకిషన్‌రావుపై, కాంగ్రెస్ అభ్యర్థి కోడూరి సత్యనారాయణగౌడ్ గెలుపొంది నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఖాతాలో రెండో విజయం నమోదు చేశారు. 2004లో జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కోడూరి, టీడీపీ అభ్యర్థి సాన మారుతి చేతిలో ఓడారు. నియోజకవర్గ పునర్విభజన అనంతరం 2009లో చొప్పదండి శాసనసభా స్థానం ఎస్సీ రిజర్వుడు కాగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గునుకొండ బాబు, టీడీపీ నుంచి పోటీ చేసిన సుద్దాల దేవయ్య చేతిలో ఓటమిపాలయ్యారు. 35 వేలకు పైగా ఓట్లతో సుద్దాల దేవయ్య గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సుద్దాల దేవయ్య, టీఆర్ఎస్ అభ్యర్థి బొడిగ శోభ చేతిలో ఓటమి పాలయ్యారు. సుమారు యాభై నాలుగు వేలకు పైగా ఓట్ల మెజారిటీతో స్థానిక ఓటర్లు తెలంగాణ వాదానికి మద్దతు పలికి కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలయ్యేలా చేశారు.

కాంగ్రెస్‌కు మళ్లీ భంగపాటు

చొప్పదండి శాసన సభా స్థానానికి 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మేడిపల్లి సత్యం, టీఆర్ఎస్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సుంకె రవిశంకర్ చేతిలో ఓటమి చవి చూశారు. సుమారు 42,127 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడం పార్టీ కార్యకర్తలకు మింగుడు పడలేదు. గతంలో వీచిన టీడీపీ గాలిలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు తీరం చేరుకోక పోగా తెలంగాణ ఏర్పడ్డాక కూడా రెండు పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి చవి చూశారు. చొప్పదండి నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి రెండుసార్లు మినహా, పదిసార్లు ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించడంతో రెండో స్థానానికి మాత్రమే పరిమితమైంది.

గెలుపుపై కార్యకర్తల ఆశలు

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని పలు సర్వేలు చెబుతున్న నేపథ్యంలో చొప్పదండిలో కాంగ్రెస్ గెలుస్తుందనే అంచనాలో కార్యకర్తలు ఉన్నారు. కాంగ్రెస్ గాలితో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ వ్యతిరేకత, బీఆర్ఎస్ కార్యకర్తల అత్యుత్సాహం, కాంగ్రెస్ అభ్యర్థి గతఎన్నికల్లో ఓడిపోవడంతో సానుభూతి వంటి అంశాలు చొప్పదండి శాసన సభా చరిత్రలో మూడో గెలుపునకు దారి తీస్తాయని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గెలుపు, ఓటముల వివరాలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	ఓట్లు	ఓడిన అభ్యర్థి	ఓట్లు
1957	రాజేశ్వర్‌రావు (పీడీఎఫ్)	9,074	బి.రాములు (కాంగ్రెస్)	8,054
1962	బి.రాములు (కాంగ్రెస్)	15,749	ఆర్.రెడ్డి (స్వతంత్ర్య)	8,216
1978	ఎన్.శ్రీపతిరావు(కాంగ్రెస్(ఐ)	26,311	ఎం.క్రిష్టారెడ్డి (కాంగ్రెస్)	20,054
1983	జి.మాధవరెడ్డి (టీడీపీ)	36,133	ఏఎస్.రెడ్డి (కాంగ్రెస్)	18,651
1985	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	55,141	బండారి రామస్వామి(కాంగ్రెస్)	13,704
1989	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	47,783	కె.సత్యనారాయణగౌడ్(కాంగ్రెస్)	39,921
1994	ఎన్‌రాంకిషన్‌రావు (టీడీపీ)	56,287	కె.సత్యనారాయణగౌడ్(కాంగ్రెస్)	30,600
1999	కె.సత్యనారాయణగౌడ్ (కాం)	54,754	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	52,842
2004	సాన మారుతి (టీడీపీ)	45,211	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	41,096
2009	సుద్దాల దేవయ్య (టీడీపీ)	68,841	గునుకొండ బాబు (కాంగ్రెస్)	35,853
2014	బొడిగ శోభ(టీఆర్ఎస్)	86,841	సుద్దాల దేవయ్య (కాంగ్రెస్)	31,860
2018	సుంకె రవిశంకర్ (టీఆర్ఎస్)	91,090	మేడిపల్లి సత్యం (కాంగ్రెస్)	48,963

అంకెల పదనిసలు

- ఓటింగ్‌లో భళారే సంఖ్యలు
- 333లు అధికం

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికలో సిత్రాలు చోటుచేసుకున్నాయి. అంకెల చిత్రాలు విస్తుగొల్పాయి. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లో మొత్తం 1,338 పోలింగ్ కేంద్రాలుండగా పలు కేంద్రాల్లో నమోదైన ఓటింగ్ సంఖ్య మూడు ఒకే అంకెల్లో ఉండటం విశేషం. కొత్తగా ప్రకటించిన ఓటర్ల సంఖ్యలోనూ ఏక అంకెల పదనిసలు ఆసక్తి కలిగించాయి. 333 సంఖ్యలు అధికంగా ఉండగా మొత్తం ఓటర్ల సంఖ్యలోనూ ఒకే సంఖ్యలున్నాయి. ఒకసారి వాటిని పరీక్షిస్తే..

పోలింగ్ కేంద్రం	గ్రామం	ఒకే అంకెలు
హుజూరాబాద్		
57	రాంపూర్	777 (పురుషులు)
90	కోర్కల్	333 (మహిళలు)
మానకొండూరు		
39	కొండపల్కల	111 (మహిళలు)
51	ఖాదర్‌గూడెం	333 (పురుషులు)
96	ఎరుకల గూడెం	444 (మహిళలు)
98	ఎరడపల్లి	222 (మహిళలు)
146	ఎల్ఎండీ కాలనీ	333 (పురుషులు)
కరీంనగర్		
190	సుభాష్‌నగర్	333 (మహిళలు)
286	కశ్మీర్‌గడ్డ	222 (పురుషులు)
చొప్పదండి		
49	గట్టుబూత్కూర్	222 (మహిళలు)
73	తిరుమలాపూర్	333 (పురుషులు)
141	చొప్పదండి	333 (పురుషులు)
155	ఇప్పనపల్లి	333 (పురుషులు)
253	కొడిమ్యాల	222 (మహిళలు)
256	కొడిమ్యాల	333 (మహిళలు)

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- 25 రోజుల్లో ఐకేపీ ఆధ్వర్యంలో 22వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- సింగిల్‌విండో ఆధ్వర్యంలో 89వేల క్వింటాళ్లు



బొమ్మనపల్లిలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. 25 రోజులుగా గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ, సింగిల్‌విండో, డీసీఎంఎస్ ద్వారా మ్యాచర్ సరిగా రాక కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో ఇందుర్తి, చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అలాగే సింగిల్‌విండో ఆధ్వర్యంలో 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోల్లు జరుగుతున్నాయి. మరో ఐదు గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు సెంటర్లలో బొమ్మనపల్లిలో 7,300, చిగురుమామిడి 6,800, ఇందుర్తిలో 8,850 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. మొత్తం సేకరించింది 22,950 క్వింటాళ్లు కాగా ధాన్యం విలువ రూ.5.55 కోట్లు, 435 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. అలాగే సింగిల్‌విండో ఆధ్వర్యంలో 12 కేంద్రాల నుంచి 89,419 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా ధాన్యం విలువ రూ.19.69 కోట్లు, 1,452 రైతుల నుంచి కొనుగోలు చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన నూతికాడి విజయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గ్రామానికి చెందిన కొందరు యువకులు కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించారు. రూ.16 వేలు సేకరించి శుక్రవారం రాత్రి అందజేశారు. ఈసందర్భంగా విజయ ఆర్థికసాయం చేసినవారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యువకులు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

మోదం.. ఖేదం

- కొన్ని పోలింగ్ బూత్‌ల్లోనే 90శాతానికి పైగా పోలింగ్
- గ్రామాల్లో పోటెత్తిన ఓటర్లు.. పట్టణాల్లో మారని తీరు
- 2018కి నేటికి తగ్గిన పోలింగ్ శాతం
- గుంటూరుపల్లి(కరీంనగర్)లో 16.37శాతమే పోలింగ్



చొప్పదండి: భూపాలపట్నం గ్రామంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ఓటర్ల ఆసక్తి మోదం.. ఖేదమన్నట్లుగా సాగింది. కరీంనగర్ నియోజకవర్గంలో అత్యల్పంగా 63.23 శాతం పోలింగ్ నమోదవగా అత్యధికంగా మానకొండూరులో 83.21 పోలింగ్ శాతం నమోదైంది. ఇక హుజూరాబాద్‌లో 83.19, చొప్పదండిలో 77.77శాతం పోలింగ్ నమోదవగా ఆయా నియోజకవర్గాల్లోని పలు పోలింగ్ బూత్‌లు మాత్రం ఆదర్శంగా నిలిచాయి. 80నుంచి 92శాతం వరకు పోలింగ్ నమోదవడం ఆహ్వానించదగ్గ పరిణామం కాగా అత్యల్పంగా కేవలం 16.37 పోలింగ్ శాతమే నమోదవడం ఆందోళనకర పరిణామం. జిల్లా ఎన్నికల చరిత్రలో ఇంత తక్కువగా పోలింగ్ నమోదవడం ఇదే తొలిసారని అధికారులు చెబుతున్నారు.

ఇంత ఘోరమా

కరీంనగర్ నియోజకవర్గంలోని గుంటూరుపల్లివాసులు ఓటుకు దూరంగా ఉండటం శోచనీయం. కొత్తపల్లి పరిధిలోని గుంటూరుపల్లిలో అత్యంత తక్కువగా పోలింగ్ నమోదైంది. 126 పోలింగ్ బూత్‌లో 904 మంది ఓటర్లు ఉండగా 222 పురుషులు, 682 మహిళలు ఓటర్లుగా ఉండగా కేవలం 148 మంది మాత్రమే ఓటు వేశారు. ఇందులో 34 మంది పురుషులు కాగా 114మంది మహిళలు ఉన్నారు.

ఇక హుజూరాబాద్‌లో అత్యల్పంగా 170 జమ్మికుంట పోలింగ్ బూత్ లో 645 ఓటర్లకు గానూ 391 మంది ఓటు వేయగా 60.6శాతం, మానకొండూరు నియోజకవర్గంలో అత్యల్పంగా 160 రామకృష్ణా కాలనీ పోలింగ్ బూత్‌లో 58.72శాతం పోలింగ్ నమోదవగా 1061 ఓటర్లకు గానూ 623 మంది ఓటేశారు. అలాగే చొప్పదండి నియోజకవర్గంలో 252 కొడిమ్యాల పోలింగ్ బూత్‌లో 60.98శాతం పోలింగ్ నమోదవగా 528 ఓటర్లకు గానూ 322 మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

80- 90శాతంపైనే

కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పోలింగ్ 80-90శాతం పోలింగ్ నమోదవడం శుభ పరిణామం. దేశ్‌రాజ్‌పల్లి, గునిపర్తి, గూడూరు, లస్మక్కపల్లి, కల్వల, సోమారంపేట, పారువెల్ల, కొండాపూర్, గోపాల్‌పూర్, తిరుమలపూర్, వెలిచాల, షానగర్ గ్రామాల్లో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది.

కరీంనగర్ నియోజకవర్గంలో..

100 నల్లగుంటపల్లి పోలింగ్ బూత్‌లో 92.08శాతం పోలింగ్ నమోదైంది. 467 మంది ఓటర్లకు గానూ 430 మంది ఓటు వేశారు. 95 తాహెర్ కొండాపూర్ పోలింగ్ కేంద్రంలో 90.97శాతం పోలింగ్ నమోదవగా 432 ఓటర్లకు గానూ 393 మంది ఓటు వేశారు. 107 గోపాల్‌పూర్ పోలింగ్ బూత్‌లో 614 మందికి గానూ 551 మంది ఓటు వేయగా 89.74శాతం పోలింగ్ నమోదైంది.

మానకొండూర్‌లో...

128 కల్వల పోలింగ్ బూత్‌లో 337 మంది ఓటర్లకు గానూ 309 ఓటు వేయగా 91.69శాతం పోలింగ్ నమోదైంది. 314 సోమారంపేట పోలింగ్ బూత్‌లో 575 మంది ఓటర్లకు గానూ 524 మంది ఓటు వేయగా 91.13 పోలింగ్ శాతం నమోదైంది. 210 పారువెల్ల పోలింగ్ బూత్‌లో 90.89 శాతం పోలింగ్ నమోదవగా 472 మందికి గానూ 429 మంది ఓటు వేశారు.

హుజూరాబాద్‌లో..

107 లస్మక్కపల్లి పోలింగ్ బూత్‌లో 91.60శాతం పోలింగ్ నమోదవగా 598 మందికి గానూ 548 మంది ఓటు వేశారు. 72 ధర్మస్‌పల్లి పోలింగ్ బూత్‌లో 91.50శాతం పోలింగ్ జరగగా 1059 మంది ఓటర్లకు గానూ 969 మంది ఓటు హక్కు వినియోగించారు. 281 గునిపర్తి పోలింగ్ బూత్‌లో 657 మందికి గానూ 594 మంది ఓటు హక్కు వినియోగించగా 90.40శాతం పోలింగ్ నమోదైంది.

చొప్పదండిలో..

319 గొర్రెగుండెం పోలింగ్ బూత్‌లో 88.45శాతం పోలింగ్ నమోదవగా 251 మంది ఓటర్లకు గానూ 222 మంది ఓటు వేశారు. 90 షానగర్ పోలింగ్ కేంద్రంలో 741 మంది ఓటర్లకు గానూ 618మంది ఓటు వేయగా 85.95శాతం పోలింగ్ నమోదైంది. 20 చరపల్లి పోలింగ్ కేంద్రంలో 85.15శాతం పోలింగ్ నమోదవగా 532కి గానూ 453 మంది ఓటు వేశారు.

గెలుపు లెక్కల్లో నేతలు తలమునకలు



ఓటింగ్ సరళిపై ఆరా తీస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్



నాయకులతో కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం

చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తున్నాయో లెక్కలు వేసుకుంటున్నారు. మండల, గ్రామ స్థాయి నాయకుల నుంచి నియోజకవర్గస్థాయి వరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు పోలింగ్ సరళిపై చర్చలు జరుపుతున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలే పొన్నం ప్రభాకర్‌ను గెలిపిస్తున్నాయని కార్యకర్తలు, నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కూడా పోలైన ఓట్లను బేరీజు వేస్తూ వొడితెల సతీశ్ కుమార్ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని చెబుతున్నారు. ఏవరి లెక్కల్లో వారు తలమునకలై ఉన్నారు. నిరుద్యోగులు, యువకులు, బీఆర్ఎస్ మేనిఫెస్టోలో తమను పట్టించుకోలేదని బాహాటంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా చిగురుమామిడి మండలంలో రెండు పార్టీలకు చెందిన నేతలు తమకంటే తమకే ఎక్కువ శాతం ఓట్లు పోలైనట్లు చెబుతుండగా మరికొందరు మాత్రం రేపటి వరకు వేచి చూస్తే గెలుపెవరిదో తేలిపోతుందంటున్నారు. ఎవరి లెక్కలు ఎలా ఉన్నఓటర్లు మాత్రం పోలింగ్ సరలిని పట్టించుకోకపోవడం విశేషం.

గంగాధర: అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో పాటు ఈవీఎంలు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. గురువారం సాయంత్రం నుంచే ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్ వెలువడటంతో చొప్పదండి నియోజకవర్గంలో గెలుపుపై బీఆర్ఎస్ అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం ఎవరి ధీమాలో వారే ఉన్నారు. శుక్రవారం సుంకె రవిశంకర్ మండలంలోని బూర్గుపల్లి గ్రామంలోని తనఇంట్లో నియోజకవర్గంలోని పలువురు నాయకులతో ఓటింగ్‌పై ఆరాతీశారు. ఏ ఊర్లో ఎన్ని ఓట్లు పోలయ్యాయి, ఏ పార్టీకి ఎక్కువగా ఓట్లు పడ్డాయని అడిగి తెలుసుకున్నారు. మండలాల వారిగా వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే గెలుపుపై ధీమాగా ఉన్నారు. మేడిపల్లి సత్యం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వచ్చిన అనంతరం మండలంలోని మధురానగర్‌లోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ గెలుస్తుందని తెలపడంతో గెలుపు ఖాయమనే ధీమాలో ఉన్నారు.

శ్రీమద్భాగవత సప్తాహ మహోత్సవం



కొత్తపల్లి: పట్టణంలో నవంబర్ 24 నుంచి శుక్రవారం వరకు భాగవత శ్రావణం త్రిదండి అహోబిల జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నరహరి నారాయణరెడ్డి సౌజన్యంతో భాగవత సప్తహ పూర్తి చేసుకుని రుక్మిణి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న జీయర్‌స్వామి హాజరయ్యారు. అహోబిల జీయర్ స్వామి చిన్న గుట్టపైకి వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి చిన్న జీయర్‌స్వామిని ఆలయ ప్రతిష్ఠకు తీసుకు వస్తానని తెలిపారు. ఈ ఉత్సవాల్లో నారాయణరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డి, గౌతమ్‌రావు, భోగ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.